## క్లుప్తంగా

### ఐటీపై విద్యార్థులకు అవగాహన



గురుకులం విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ వెంకటేశ్వరరావు

అల్లవరం: గోడిలోని బాలుర గురుకులానికి చెందిన విద్యార్థులకు భట్లపాలెంలోని బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఇండస్ట్రియల్ విజిట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ పర్యవేక్షణలో ఐటీ ట్రైనర్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 9, 10, ఇంటర్ విద్యార్థులకు ఐటీపై అవగాహన కల్పించారు. ఐటీ ల్యాబ్, ఇంజినీరింగ్ టూల్స్, ల్యాబ్, వాటి పనితీరుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బీవీసీ ప్రిన్సిపాల్ జేవీజీ రామారావు, గురుకులం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుని కుటుంబానికి సహాయం అందజేస్తున్న సామ్యూల్ సాగర్

తాళ్లరేవు: మండల పరిధిలోని ఉప్పంగల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రెడ్డి గోవిందరాజులు కుటుంబాన్ని జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్ బుధవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. స్థానిక సర్పంచ్ శాఖ శంకరుడుతో కలిసి రూ.4 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో చెల్లుబోయిన శ్రీనివాసరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

### యాంటీ బయోటిక్స్ వినియోగంపై అవగాహన

యానాం: ప్రపంచ యాంటీ బయోటిక్స్ అవగాహనా వారంలో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు యాంటి బయోటిక్స్ వినియోగంపై వైద్యులు అవగాహన కల్పించారు. వైద్యుల సూచనల మేరకే యాంటి బయోటిక్స్ మందులను వినియోగించాలని ఎవరూ సొంతంగా వినియోగించరాదని సూచించారు. అదేవిధంగా ఒకరికి రాసిన యాంటి బయోటిక్స్ మందులను వేరొకరికి వినియోగించ కూడదని తెలిపారు. యాంటీబయోటిక్స్ మందులు ఎక్కువగా వినియోగించడం వల్ల పలు సమస్యలు ఉత్పన్నమవుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ డీడీ డాక్టర్ టి రవిశంకర్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### పశు గర్భధారణపై దృష్టి సారించాలి



పశువుకు వైద్యం చేస్తున్న జిల్లా పశువైద్యాధికారి వెంకట్రావు

ఉప్పలగుప్తం: రైతులు పశుగర్భ ధారణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పశువైద్యాధికారి కె.వెంకట్రావు అన్నారు. మండలంలోని పెదగాడవిల్లి పశువుల ఆసుపత్రి వద్ద నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరానికి బుధవారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా 78 పాడి పశువులకు గర్భకోశ చికిత్స అందించి, 43 పెయ్యిలకు నట్టల నివారణ, డీవార్మింగ్ మందులు అందించారు. కార్యక్రమంలో ఏడీ సీహెచ్ గోపాలకృష్ణ, పశువైద్యాధికారులు ఎస్.నిరోషా, ఆకుల రమేష్, యామిని, సుధీర్, జేవీఓ రామారావు, వెంకటరత్నం, కొల్లు కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు

అయినవిల్లి: ముక్తేశ్వరంలోని ముక్తికాంతక్షణ ముక్తీశ్వరుని ఆలయంలో ఉసర్న శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామివారికి బుధవారం భక్తిశ్రద్ధలతో ఉత్పన్న ఏకాదశి పూజలు చేశారు. ఆలయ అర్చకులు అంగర రవికాంత్, సాయిపవన్‌ల ఆధ్వర్యంలో ఈ పూజలు జరిపారు. ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిరంలో శ్రీకృష్ణునికి ఆలయ నిర్వాహకులు సుందర శ్రీనివాస్ దాస్ ప్రభుజీ ఆధ్వర్యంలో విశేష పూజలు జరిపారు. అయినవిల్లి సీతారామచంద్రస్వామివారి ఆలయంలోను విశేష పూజలు జరిపారు.

# ప్రకృతి వ్యవసాయం.. ఆరోగ్యదాయకం

- తక్కువ ఖర్చుతో అధికాదాయం
- రసాయనాలు లేకుండా కషాయాలతో సాగు
- సత్ఫలితాలిస్తున్న పంటకోత ప్రయోగాలు
- ఆసక్తి చూపుతున్న అన్నదాతలు



పి.మల్లవరంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేసిన వరిచేను



పంటకోత ప్రయోగం చేస్తున్న అధికారులు

తాళ్లరేవు: వ్యవసాయంలో రసాయనాలు, ఫెర్టిలైజర్స్ వినియోగంతో ఆహార పదార్థాలు కలుషితంగా మారి ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్న నేటి రోజుల్లో ప్రకృతి వ్యవసాయం ఒక వరంలా మారింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అందరి దృష్టి గోఆధారిత ప్రకృతి వ్యవసాయంపై పడింది. ఎకరాకు 20 బస్తాలకు పైగా దిగుబడి వస్తుండడంతో ప్రకృతి వ్యవసాయం చేసేందుకు అన్నదాతలు ఆసక్తి చూపుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) అందిస్తున్న సహకారంతో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో పలు చోట్ల రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని చేపడుతున్నారు. ఈ విధానం ద్వారా వరిపంటతో పాటు పండ్లు, కూరగాయల సాగును చేపట్టి రసాయనాలు లేని, ఆరోగ్యవంతమైన ఆహార పదార్థాలను ఉత్పత్తి చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంలో తొలుత పిల్లిపెసర, జీలుగ తదితర గడ్డిజాతులకు చెందిన 31 రకాల విత్తనాలు భూమిలో జల్లాలి. 45 రోజుల తరువాత భూమిలో వాటిని కలియదున్నాలి. అనంతరం ఎకరాకు 400 కేజీల ఘన జీవామృతాన్ని రెండు దఫాలుగా వేసుకోవాలి. దుక్కులో 200 కేజీలు, నాట్లు వేసిన తరువాత 200 కేజీలు వేసుకోవాలి. విత్తనాలను బీజామృతంతో విత్తన శుద్ధి చేసి నాట్లు వేసుకోవాలి. ప్రతి 15 రోజులకు జీవామృతం వినియోగించాలి. 20 రోజులకు ఒకసారి వేపాకుతో తయారు చేసే మీమాస్త్రాన్ని తెగుళ్లు రాకుండా వినియోగించాలి. వాతావరణం రీత్యా సమస్యలు వచ్చినప్పుడు వివిధ రకాలైన కషాయాలను వాడి పంటను కాపాడుకోవచ్చు. రైతుల సౌకర్యార్థం ఆయా కషాయాలు, జీవామృతాలు తయారు చేసి అందించే దుకాణాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు.

### ఎకరాకు 22 బస్తాల దిగుబడి



పి.మల్లవరం పంచాయతీలో మా పర్యవేక్షణలో చేపట్టిన సేంద్రియ సాగులో బర్మా బ్లాక్ రైస్ ఎకరాకు 22 బస్తాల దిగుబడి వచ్చింది. ఇది శుభపరిణామం. స్థానిక రైతుల సమక్షంలోనే పంట కోత ప్రయోగం చేపట్టాం. నారు శుద్ధినుంచి పంట పద్ధతులు పాటించటం ద్వారా 110 రోజులకు గానూ ఈ దిగుబడి వచ్చింది. దీంతో సుమారు 100 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడానికి ముందుకు వచ్చారు. సేంద్రియ ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో మార్కెటింగ్ టీంలు ఏర్పాటు చేస్తోంది.

ఎస్.ధనలక్ష్మి , మాస్టర్ ట్రైనర్, ఏపీసీఎన్ఎఫ్, కరప డివిజన్.

### అనారోగ్యాలు దూరం



ఆర్గానిక్ ఆహార పదార్థాలను వినియోగించడం ద్వారా అనారోగ్యాలకు దూరంగా ఉండొచ్చు. రసాయనాలు వినియోగించిన ఆహార పదార్థాలు తినడం ద్వారా అనేక మంది క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రతి ఇంట్లో క్యాన్సర్ బాధితులు కనిపిస్తున్నారు. దీనిని నిరోధించాలంటే ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలనే తినాలి. పట్టణాల్లో చాలా మందికి అవగాహన కలిగి ఆర్గానిక్ వస్తువులను వినియోగిస్తున్నారు. అయితే పల్లె ప్రజల్లో మాత్రం మార్పు రావాల్సి ఉంది.

నాగేంద్ర వర్మ, ఆయుర్వేద వైద్యుడు.

### మూడేళ్లుగా పండిస్తున్నాం



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెరగడంతో గత మూడేళ్లుగా సాగు చేస్తున్నాం. అయితే కేవలం మా కుటుంబ అవసరాల నిమిత్తం మాత్రమే పండిస్తున్నాం. ఈ ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేస్తే పూర్తిస్థాయిలో ప్రకృతి వ్యవసాయాన్ని చేపడతాం.

గుత్తుల మహేష్, రైతు, సీలపల్లి పంచాయతీ.

### సుబ్రహ్మణ్యేశ్వరస్వామి హుండీల ఆదాయం లెక్కింపు



హుండీలలో నగదు లెక్కిస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్: స్థానిక కృష్ణేశ్వర సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం హుండీలను బుధవారం తెరిచి లెక్కించారు. హుండీల ద్వారా 10 నెలల 25 రోజులకు గాను రూ.2.84 లక్షల ఆదాయం సమకూరినట్లు దేవస్థానం ఈవో ఆర్.శ్రీనివాస్ తెలిపారు. దేవదాయ తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో సేవా సమితి సభ్యులు హుండీలను తెరిచి లెక్కించారు.

### అధికారులకు అదనపు బాధ్యతలు

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా ముగ్గురు ఐఏఎస్ అధికారులకు ఆయా శాఖలకు సంబంధించి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ బుధవారం ప్రభుత్వ డిప్యూటీ కార్యదర్శి వి జైషాన్ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ప్రధాన ఎన్నికల అధికారిగా, విద్యాశాఖ కార్యదర్శిగా కొనసాగుతున్న పి జవహర్‌కు అదనంగా ఆర్థిక, కార్మిక శాఖలను అప్పగించారు. రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ కార్యదర్శిగా ఉన్న ముత్తమ్మకు అదనంగా కుటుంబ సంక్షేమం, ఎక్సైజ్ అండ్ పోర్ట్స్‌ను అప్పగించారు. కలెక్టర్ కులొంత్తున్‌కు అదనంగా రెవెన్యూ, పునరావాస శాఖలు కేటాయించారు.

# రసాభాసగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

- కార్యాయ ఆవరణలో ఓ ప్రైవేటు షాపునకు నిధులు కేటాయించడంపై దుమారం
- తీర్మానం లేకుండా నిర్ణయం తీసుకోవడంపై సభ్యుల ఆగ్రహం
- చెల్లింపులు, ఆక్రమణలు నిలిపివేయాలని కౌన్సిల్ నిర్ణయం



సమావేశంలో కమిషనర్‌ను నిలదీస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, కౌన్సిలర్లు

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గల మీసేవా కేంద్రం భవనంలో ఓ బడా వ్యాపార సంస్థకు మున్సిపాలిటీ దాసోహమై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రూ.9 లక్షలు చెల్లించిన కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు నిర్ణయాన్ని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌తో పాటు పాలక, ప్రతిపక్షానికి చెందిన కౌన్సిలర్లు నిలదీశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన కౌన్సిల్ హాలులో బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆద్యంతం ఈ అంశంపైనే వాదోపవాదాలు జరిగాయి. కమిషనర్ రాజును సమావేశంలో దాదాపు గంట సయయం పాటు నిలబెట్టి మరీ ఎమ్మెల్సీ, కౌన్సిలర్లు నిలదీశారు. వారు అడుగుతున్న ప్రశ్నలకు కమిషనర్ బదులు చెప్పలేక ఇబ్బంది పడ్డారు. ఓ ప్రైవేటు సంస్థ కోసం రూ.9 లక్షలు వెచ్చించడం.. ఆ భవనాన్ని అద్దెకు తీసుకున్న ఓ కాంట్రాక్టర్ వ్యాపార సంస్థకు సబ్ లీజుకు ఇవ్వడాన్ని నిబంధనలు ఒప్పుకోవని ధ్వజమెత్తారు. కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై ఇదంతా చేశారని ఎమ్మెల్సీ, కౌన్సిలర్లు కమిషనర్‌పై పలు మార్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణిని మీరెలా అందుకు ఒప్పుకున్నారని ఎమ్మెల్సీ, కౌన్సిలర్లు అడిగినప్పుడు ఆమె చెప్పిన సమాధానంతో కౌన్సిల్ మరోసారి వేడెక్కింది. దీనిపై రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని కమిషనర్ తనకు చెప్పడంతో అందుకు సరేనని చెప్పానని చైర్‌పర్సన్ సభాముఖంగా చెప్పడంతో వ్యవహారం మరింత జఠిలంగా మారింది. ఆ రాజకీయ నేత ఎవరో చెప్పాలని అంతా డిమాండ్ చేయడంతో అధికారులు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. ట్రాన్స్‌ఫార్మర్ నిమిత్తం ట్రాన్స్‌కోకు మున్సిపాలిటీ నుంచి రూ.9 లక్షల చెల్లింపులను నిలిపివేసి ఆ వ్యాపార సంస్థ కోసం ప్రోత్సహించిన ఆక్రమణలను అదుపు చేయాలని ఎమ్మెల్సీ, కౌన్సిలర్లు నిర్ణయించారు. ఇదే విషయాన్ని కమిషనర్‌కు చెప్పి ఆయనకే ఆ బాధ్యతలు అప్పగించారు.

## మహిళలు సంఘటితంగా ప్రతిఘటించాలి




ప్లకార్డులతో ర్యాలీ చేస్తున్న బీమాబాయి మహిళా మండలి సభ్యులు, మహిళలు

తాళ్లరేవు: మహిళలు తాము ఎదుర్కొంటున్న హింసలను సంఘటితంగా ఎదుర్కోవాలని బీమాబాయి మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధన పిలుపునిచ్చారు. జెండర్ ఆధారిత హింసలకు వ్యతిరేకంగా 16 రోజుల పాటు నిర్వహించే అంతర్జాతీయ ప్రచార కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తాళ్లరేవు పురవీధుల్లో ప్లకార్డులు చేపట్టి ప్రదర్శన నిర్వహించారు. మహిళలు, బాలికలకు మద్దతుగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీమాబాయి మహిళా మండలి ఉమెన్ ప్రోగ్రాం ఆర్గనైజర్ ఘాన్సీ, తాళ్లరేవు, ఐ.పోలవరం మండలాలకు చెందిన మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ కార్మికుల నూతన కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గ ప్రతినిధులను సత్కరిస్తున్న సంఘీయులు

అమలాపురం టౌన్/రూరల్: జిల్లా తెలుగునాడు విద్యుత్ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక వాసర్ల గార్డెన్స్‌లో బుధవారం జరిగిన సమావేశంలో సంఘ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం ప్రాంతీయ అధ్యక్షుడు గణేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ అయిదు జిల్లాల కార్యదర్శి బి.రవీంద్ర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.సత్యనారాయణ తదితరుల సమక్షంలో జిల్లా విద్యుత్ కార్మికుల సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటైంది. జిల్లా సంఘం నూతన అధ్యక్షునిగా గణేష్, కార్యదర్శిగా బి. వెంకటేశ్వరరావులను ఎన్నుకున్నారు. దేవదాసు రమేష్, కుడుపూడి బాలాజీ, బడుగు రాజులు జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. సంఘం అమలాపురం డివిజన్ అధ్యక్షుడు సీహెచ్.గిరిధర్, కార్యదర్శి వి.మోహనబాబు తదితరులు పాల్గొన్నారు. చివరిగా నూతన కార్యవర్గ ప్రతినిధులను ఘనంగా సత్కరించి అభినందించారు.

### రేషన్‌షాపుల ద్వారా నిత్యావసరాల పంపిణీ

యానాం: వచ్చే నెల నుంచి రేషన్‌షాపుల ద్వారా కార్డుదారులకు ప్యాకింగ్ చేసిన ఉచిత బియ్యం బ్యాగ్‌లను పంపిణీ చేస్తామని బుధవారం సీఎం రంగసామి వెల్లడించారు. రేషన్‌షాపుల ద్వారా బియ్యం తదితర నిత్యావసరాల పంపిణీకి సంబంధించిన అగ్రిమెంట్ పూర్తయ్యిందని దానికి సంబంధించిన ఫైలు ఎల్జీ కె కైలాష్‌నాథన్‌కు పంపినట్లు తెలిపారు. 20 కేజీల బియ్యం బస్తాలను పంపిణీ చేస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌లను నెరవేరుస్తామన్నారు.

### మద్యం తరలింపుదారుల అరెస్ట్

తాళ్లరేవు: డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వారి ఆదేశాల మేరకు నిర్వహించిన దాడుల్లో 38 మద్యం సీసాలతో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు తాళ్లరేవు ఎక్సైజ్ సీఐ కె.కోటేశ్వర్ తెలిపారు. కరప మండలం పెద్దాపురప్పాడు గ్రామానికి చెందిన యాళ్ల శంకర్, వాసంశెట్టి సత్యనారాయణ అనే ఇద్దరు వ్యక్తులు బైక్‌పై మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని బైక్‌ను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఎక్సైజ్ ఎస్సై వై.నాగేంద్రకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

- ఎన్నికల కోడ్ నేపథ్యంలో చర్చలు లేకుండానే ముగింపు



మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాయుడు సునీత

తాళ్లరేవు: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని బాలయోగి సమావేశ మందిరంలో ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఎంపీడీఓ కె.సత్యనారాయణ అత్యవసర సేవలకు సంబంధించి పలు అంశాలపై సభ్యులతో చర్చించారు. అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అత్యవసర సేవలకు సంబంధించి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, వైస్ ఎంపీపీలు కొపనాతి లలిత, ధూళిపూడి నాగేంద్రప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు నందికోళ్ల శ్రీదేవి, కోరుకొండ కిరణ్‌కుమారి, చిట్టూరి లలిత పద్మ, పాలెపు పోశియ్య, యర్రంనీడి అప్పారావు, గర్రే సాయిలక్ష్మి, రత్స ముత్యాలు, దంగేటి సూరిబాబు, గుత్తుల శ్రీను, బళ్ల సంధ్యారాణి, కడియాల లక్ష్మి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎం.నాగార్జున, ఏఓ ఎస్.ప్రశాంతి, ఇరిగేషన్ ఏఈ అనూష, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి రూ.11 లక్షల బీమా అందజేత



కుటుంబీకులకు బీమా చెక్కును అందజేస్తున్న సూపరింటెండెంట్ నవీన్‌కుమార్

అమలాపురం టౌన్: పోస్టల్ బీమా ప్రీమియం క్రమం తప్పకుండా చెల్లిస్తున్న అంబాజీపేట మండలం పుల్లేటికుర్రుకు చెందిన పులగర్త శరత్ సుధాకర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబ సభ్యులకు స్థానిక పోస్టల్ డివిజన్ కార్యాలయంలో రూ.11.16 లక్షల బీమా చెక్కును పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్. నవీన్‌కుమార్ బుధవారం అందజేశారు. రూ.10 లక్షల మేర పోస్టల్ బీమా తీసుకున్నట్లు సూపరింటెండెంట్ చెప్పారు. పోస్టల్ బీమా పొందేందుకు అతి తక్కువ ప్రీమియం చెల్లించే అవకాశాన్ని మరే బీమా కంపెనీలు ఇవ్వనంతగా పోస్టల్ శాఖ ఇస్తోందని ఆయన వివరించారు.

### విలసవిల్లిలో మహాలింగార్చన



ఉప్పలగుప్తం: పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని విలసవిల్లి రామ మందిరంలో పండితులు మున్నంగి రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ద్రాక్ష, దానిమ్మ ఫలాలతో మహాలింగార్చన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రత్యేక అభిషేకాలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## సాఫ్ట్‌బాల్ క్రీడలో విద్యార్థుల ప్రతిభ



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఐ.పోలవరం: ఈ నెల 22 నుంచి 24 వరకు చిత్తూరు జిల్లా అరకొండలో జరిగిన 68వ స్కూల్ గేమ్స్ సాఫ్ట్ బాల్ అండర్–14 బాలికల విభాగంలో జి.వేమవరం ఉన్నత పాఠశాలకు చెందిన హెచ్.అనన్య, ఎం ఝాన్సీశ్రీలు ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సలాది వెంకటనారాయణ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఫిబ్రవరిలో గుజరాత్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. వీరిని జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దిన పీడీ జి.కళావతి, పీఈటీ ఎ.నాగరాంప్రసాద్‌లను ఎస్ఎంసీ చైర్మన్ బసవ అప్పారావు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

## రైతాంగం అప్రమత్తంగా ఉండాలి

ఉప్పలగుప్తం: తుఫాన్ ప్రభావంతో అధికంగా వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో గ్రామాల్లో వరి కోత కోసే రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వి.ఎస్.దివాకర్ తెలిపారు. కోత కోసిన రైతులు ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. రైతులకు ధాన్యం తరలింపులో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా మండల వ్యవసాయాధికారి (8331056518), తహశీల్దార్ ((8008803200) నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించారు.

**వరికోతలు వాయిదా వేసుకోవాలి**

ముమ్మిడివరం: బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాన్ ప్రభావం కోనసీమ జిల్లాపై ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎం.సుబ్బలక్ష్మి సూచించారు. తీర ప్రాంతాల మత్స్యకారులు వేటకు వెళ్లరాదన్నారు. రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని, ఇప్పటికే కోతలు కోసిన వరిధాన్యం భద్రపర్చుకోవాలని సూచించారు. రానున్న నాలుగు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వ్యవసాయశాఖ సిబ్బందిని సంప్రదించి తగు సూచనలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రాకూడదన్నారు. పురాతన ఇళ్లలో నివాసం ఉండరాదని స్థానికంగా ఉన్న తుఫాన్ షెల్టర్ లేదా ప్రభుత్వ భవనాల్లో తీవ్రత తగ్గే వరకు నివాసం ఉండాలని సూచించారు.

## రోడ్ల భద్రతపై అవగాహన ర్యాలీ




ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అమలాపురం టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్న సందేశంతో స్థానిక శ్రీచైతన్య స్కూలు విద్యార్థులు బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం స్కూల్‌లో ట్రాఫిక్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, సీటు బెల్ట్ విధిగా ధరించాలని, హెల్మెట్ పెట్టుకునే ద్విచక్ర వాహనాలను నడపాలని ర్యాలీలో నినాదాలు చేశారు. శ్రీచైతన్య విద్యా సంస్థల ఏజీఎం సురేష్ తెలిపారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు కొవ్వొత్తుల ర్యాలీ



తాళ్లరేవులో కొవ్వొత్తుల ర్యాలీ చేపడుతున్న మహిళలు

తాళ్లరేవు: బాల్య వివాహాలు లేని దేశం రావాలని కోరుతూ బుధవారం పలు పంచాయతీల్లో ర్యాలీలు నిర్వహించారు. చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహ రహిత భారత్ పేరుమీద మండలంలోని పది పంచాయతీలలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కోరంగి, చొల్లంగిపేట, సుంకరపాలెం, పి.మల్లవరం తదితర పంచాయతీలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కోఆర్డినేటర్ పి.త్రిమూర్తులు, అంగన్వాడీ సెక్టార్ సూపర్‌వైజర్‌లు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.